శృంగార గ్రంథములు ౮

శృంగార భల్లాణచరిత్ర

[illegible]

గంగాధరకవి ప్రణీతము

ప్రకాశకులు:
జి. యస్. శాస్త్రి అండు కో.,
మద్రాసు.

ప్రథమ ముద్రణము

లండన్ రాయల్ యెడిషన్

1928

చెన్నపురి

సమదర్శిని కార్యాలయమున

ముద్రితము



జంగము - వేశ్య

పత్రిక.

జాను దెనుఁగు నుడికారముల సొంపు పెంపొంద, శివభక్తుల చరిత్రములను ద్విపదలుగా దొలుదొల్త రచియించిన మహాకవి, పాల్కురికి సోమనాథుఁడు. ఆతని రచనములయందు సూచింపఁబడిన యొక శివభక్తుని గాథావేశమే యిట్లు భల్లాణ చరిత్రమను పేర ద్విపదరచనముగా వెలసినది. ఈ రచనమునకుఁ గృతికర్త.

చితారు గంగాధరకవి, సిరియాళ చరిత్రమను కృత్యంతరమున నీతడు వెనవెళ్ల గంగాధరుఁడని కలదు. వీరిద్దఱును, వీరయ్యా మల్లమాంబికలనే, తలిదండ్రులనుగాఁ బేర్కొన్నారు. రెండును శివభక్తుల చరిత్రములు; ద్విపదలు; రచనమునఁ జాలపోలిక గలవి; కాన, వీరిరువురు నొక్కరే యగుదురు. వెనవెళ్ల యీతని గ్రామనామమును, 'చితారు' ఇంటిపేరును,

కాఁదగును. రచనమునుబట్టి, యితనిఁ బదునేడవ శతాబ్దమునకుఁ జెందినవాఁనిగ, నూహింపఁదగును.

భల్లాణ చరిత్ర.

సింధు కటకాధీశుఁడగు, భల్లాణరాజు చరిత్ర మిందు వర్ణిత మైనది. భల్లాణుఁడు శివభక్తాగ్రేసరుఁడు, జంగము లేదియడిగిన లేదనక యిచ్చుటకు, దీక్షఁబూనినవాఁడు. ఇతని శక్తిని, బరీక్షించుటకై శివుఁడు, విటజంగమమై యితని యొద్దకు వచ్చి సంభోగార్థము, వేశ్యను గూర్పఁ గోరినాఁడు. శివుని మాయచే వేశ్య యొక్కతె యైనఁ బట్టణమున లభింపమిచేఁ దనపత్నినే వేశ్యనుగా నాజంగమున కర్పించినాఁడు రాజు. శివుని డాతని దీక్షకును, తెగువకును, భక్తిని మెచ్చి, యాతనికి సాయుజ్యము నొసఁగినాఁడు. పాల్కురికి సోమనాథుఁడు పేర్కొన్న శివభక్తులందఱు చరిత్రలందినవారే. ఈభల్లాణుఁడు సైత మట్టివాఁడే యగును. ఇది భావి పరిశీలనమువలనఁ దేలఁ గలదు.

ఈ పరమభక్తాగ్రణి చరిత్రమును పలువు రితరకవులు ప్రబంధములుగను, నాటకములుగను, దండకములుగను రచియించినారు.

విశేషములు.

గ్రంథమున 'కొలిపాక గంటలను' జంగములు దాల్చువారని కలదు. (చూ ౧౧ పే. చివ పంక్తి) (పశ్చిమచాళుక్యరాజయినసింహబల్లహుని రాజ్యస్థానములలో, నీ కొలిపాక యొకపట్టణము; ఇది నిజామురాష్ట్రాంధ్రదేశమున నున్నది. (చూ. బసవపురాణ పీఠిక పే ౬౧,౬౨) ఈ కొలిపాక శైవులకు రాజధాని. సుప్రసిద్ధ శైవాచార్యుఁడగు రేవణసిద్ధుని జన్మస్థానము. ఈపట్టణమున నాకాలమున జంగములు వాయించు కంచుగంటలు విరివిగాఁ బోఁత పోయుచుందురు.

ఈ గ్రంథము భక్తిరస ప్రధానమైనది. శృంగారమంగము గాఁగలది. ఇందు వేశ్యాశృంగారమును కవి సరసముగా సంతరించినాఁడు. ఇతఁడు లక్షణమును ఒక్కొకచో శబ్దస్వరూపమును

నైత మంతగాఁ బాటింపక పామరులకును సుబోధకముగ నుండునట్లు తేట తెలుఁగు మాటలతో దీనిని రచియించినాఁడు.

ఈతఁడు ప్రాస యతిని వాడలేదు.

శృంగార గ్రంథమాలయం దిది నాలుగవ గ్రంథము, ఈగ్రంథమును, మున్నటివానివలెనే సరసాంధ్రజన సమాదరణ పాత్రమై ఒకటివెంట నొకటిగాఁ బ్రాచీన రచనములను బ్రకటింపఁ బూనియున్న మా ప్రయత్నమును గొనలు సాగఁ జేయునుగాక యని యాశించుచున్నాము.

విభవ వైశాఖశుద్ధ పంచమి మంగళవారము	ఇట్లు. గంటి సూర్యనారాయణశాస్త్రి, సంపాదకుడు.

శ్రీః

శృంగారభల్లాణచరిత్ర

అవతారిక

శ్రీ గురులింగ సంచితనిర్మలాంగ
భోగీంద్రకేయూర పుణ్యసంచార
పరమకృపాశీల భక్తవిలోల
కరిరాజమదభంగ కామభస్మాంగ
నారాయణస్తోత్ర నగజాకళత్ర
వీరావతార యోవిధిగర్వదూర
నాకేశనుతపాద నాదవినోద
యోకాశికానాథ యోవిశ్వనాథ
యని యిట్టులాస్వామి నభినుతిసేసి
తనరంగ గురుపదధ్యానంబు సల్పి
కరమర్థి బసవన్న గనుఁగొని మ్రొక్కి
కరిముఖు నర్చించి గణములఁ బొగడి
అన్నపూర్ణాంబను నాత్మలోఁ దలఁచి

శృంగారభల్లాణ చరిత్ర

పన్నగధరు వీరభద్రునిఁ గొలిచి
ఫాలాక్షు సోమేశుఁ బ్రార్థనసేసి
వాలాయముగ భక్తవరుల నుతించి
శ్రీపతిపండితుఁ జిత్తమం దెంచి
ప్రాపగుమంచనపండితుఁ దలఁచి
భవ్యుఁడౌ శ్రీచెన్నబసవనిఁ గొలిచి
సేవ్యుండు మడివాలు శేఖరుఁ బొగడి
మురియుచు సారూప్యమును బొందినట్టి
పరమపావనులైన ప్రమథులఁ దలఁచి
శివకవులనుతించి శివయోగమునను
గవితా విశేషంబుఁ గరమర్థిఁ బడసి
అనుసించి వీరేశు కర్పించుకొఱకుఁ
బోరి మించు భల్లాణభూవరుచరితఁ
దెనుఁగున ద్విపదగాఁ దెల్లంబు సేతు
ఘనులు ప్రస్తుతిసేయఁ గవిబుధుల్ మెచ్చఁ
బనిపూని శివభక్తిపరులు నుతింప
వినుపింపవలసిన విజ్ఞానపరుఁడఁ
బరమశివాచారభరితవర్తనుఁడ

అవతారిక

గురులింగజంగమ కరుణాన్వితుండ
ఘనునిభ వీరయ్యమల్లమాంబికల
వరపుత్రుండగువాండ వంశవర్ధనుండ
ఘనమైన చిత్తారు గంగాధరుండ
వినుపింతు నా నేర్చువిధమున మెఱసి.
భూమిపై సురరాజ పూజితంబైన
నైమిశారణ్యంబునం దొక్కనాండు
ఘనపుణ్యులగు శౌనకాదులు సూత
మునిం జూచి సంతోషమున నిట్టులనిరి.
పరమపావనులైన ప్రమథేంద్రవరుల
చరితలు మీవల్లం జవులుప్పతిల్ల
వినంగల్గె లెస్సగా విజ్ఞానభక్తి
ననఘ, వేఱొకకథ నడుగంగవలయు
భావజహరుండైన పార్వతీవిభుండు
దేవాదిదేవుండు దీనులకెల్లం
ధల్లియుం దండ్రియై ధరకును డిగ్గి
భల్లాణరాయని ప్రణతిరత్నంబు
నడుగం గారణమేమి యానృపుండైన

మహి మించు ముత్యాలమంటపంబులును
సంగడిబావులు సంబరంబిడెను
ముంగిళ్ల ముత్యాలముగ్గులు గలిగి
చూడ నింపగు సూర్యసోమవీథులును
వేడుక నింటింట వృషభధ్వజములు
దేదీప్యమానముల్ దేవాలయములు
నాదిక్కునను నొప్పు యజ్ఞశాలలును
లలితమై తనరెను లక్షగాదెలును
సలలితంబైయున్న శస్త్రశాలలును
ఎన్న గోచరమైన హేమకుంభములు
నున్నతసౌధంబు లుజ్జ్వలంబైన
మణిగోపురంబులు మణిమంటపములు
మణితోరణంబులు మణిమందిరములు
నారికేళాశోక నాగ పున్నాగ
వారిజ మందార వట బిల్వ తాల
జంబీర తింత్రిణీ చందన నింబ
హంబాళ హింతాళ కాశ్వత్థ బిల్వ
బదరికా ఖర్జూర పనస రుద్రాక్ష

ప్రథమాశ్వాసము

కదళికా కురువింద ఘనసారకములు
మొదలైన బహువృక్షములచేత నమరి
పదివేల శాఖలై ప్రబలిపుష్పముల
ఫలముల మధురసభరితమై యున్న
చిలుకలు వీక్షించి చేకొని [illegible]
పలుకుచు నొక్కొక్క ఫలమును [illegible]
కలిగి తుమ్మెదలు ఝంకారంబు [illegible]
తెలివైన సుమముల తేనియల గ్రోలం
గలపక్షిరవముల కలకలధ్వనుల
వలనొప్పు నుద్యానవనములు గలిగి
విలసిల్లు త్రిభువనవిఖ్యాతి [illegible]
బ్రహ్మతో నైనను భా[illegible]
బ్రాహ్మణమని యొప్పు [illegible]
దశరథాత్మజుకంటె ధరణిలో [illegible]
యశముచే వెలసినయట్టి [illegible]
జలనిధు లేడింటి [illegible]
నలరిన ఘనవంతు[illegible]
బురుహూతుమించిన [illegible]

సురుచిరంబైనట్టి శూద్రసంఘములు
కిన్నర గంధర్వ గీర్వాణ యక్ష
కన్యలఁ గాదనుకామినీమణులు
కరినైన నీక్షించి కరమునఁ బట్టి
పొరలింపఁజాలిన భుజబలోన్నతులు
బిరుదురాహుత్తులే పేర్కొని రిపులఁ
దరుమనోపినయట్టి దండిసాహసులు
కొదలేక కదలాడు కొండలోయనఁగ
మదమెక్కి తూగాడు మత్తేభములును
మెరసి పాఱుచునున్న మిన్నేరుదాటి
యురుకనోపినయట్టి యుత్తమాశ్వములు
వలనైన రంభ నూర్వశినైన గెల్వఁ
గల రాపురిని వారకామినీమణులు
వీర శైవాచార విజ్ఞానకలిత
కారుణ్యధారు లఖండితవ్రతులు
వదలని యతిశీలవ్రతములచేతఁ
బదిలక్షలకునైనఁ బదికోట్లకైన
జంగమార్చనసేయు సద్భక్తవరులు

ప్రథమాశ్వాసము

సంగలింగాంగులు నాచారపరులు
మారటరుద్రులు మహిఁ జూడఁగలిగి
యారూఢముగఁ బట్టమంత యిబ్బంగి
నీశ్వర ప్రీతిగా నిహపరాదులకు
విశ్వకర్మయును గావించినయట్టి
యాసింధుకటకంబు నతిసంభ్రమమున
వాసిగా నేలెడు వంశవర్ధనుఁడు
కరకరి రిపుగజకంఠీరవుండు
పరమోపకారుండు బహుదానపరుఁడు
సంగరవిజయుండు సత్యసంధుండు
జంగమతీర్థ ప్రసాదసేవకుఁడు
వనధి గంభీరుండు వరగుణోజ్జ్వలుఁడు
జననాథుఁ డాహరిశ్చంద్రవంశజుఁడు
భసితత్రిపుండ్రుఁడు భక్తవర్యుండు
రసికుండు భల్లాణరాజశేఖరుఁడు
అతనికి నిజరాణి యలికులవేణి
యతిముగ్ధ పూఁబోణి యతివసామ్రాణి
పల్లవపాణి యా పరమకళ్యాణి

చల్లమాదేవి నా సతిమణి గలదు
చల్లమాదేవికి సవతిరత్నంబు
మల్లికాదేవి యన్మానిని గలదు
ఇరువురు సతులతో నినకులేశ్వరుఁడు
సరసప్రవీణుఁడై సద్గోష్ఠినుండి
నిర్మలచిత్తుఁడై నెటి నొక్కనాఁడు
ధర్మమార్గంబులఁ దలపోసి చూచి
రథికులు సేవింప రాజులు గొల్వ
నధికసంభ్రమమున నానంద మొంది
గురునిసన్నిధి కేఁగి గురునాథుఁగాంచి
శరణార్థియని మ్రొక్కి సద్భక్తి నిలిచి
కరమర్థిఁ గొనియాడి కణఁకతోఁ బలికె
వరపుణ్య, నాపిన్నవాక్యంబు వినుము
యొడయ లేమైనను నొనరంగ నడుగ
గడపక యొసఁగెడి ఘనబుద్ధి నాకుఁ
బొడమెను బోదియబొట్టు నానుదుట
కడఁకతో ధరియింపు గైకొంటి వ్రతము
నని యిట్లు భల్లాణుఁ డాడువాక్యములు

విని గురునాథుండు విస్మయంబంది
యాభక్తవరుఁ జూచి యప్పుడిట్లనియె:
ఓభూమినాయక, యో శిష్యవర్య,
యానమలోచను భూతి నందఁగారాదు
వసుధేశ, నీ కింతవైరాగ్యమేల?
యిప్పటితాత్పర్య మెల్లకాలంబు
నొప్పుగా నిలువ దోయుర్వీశ, వినుము
వరశిష్యుఁ డేపాటివ్రతము దప్పినను
గురునాథునకుఁ జాలఁగొదవ సిద్ధించు
నియ్యనోపుదుమని యిచ్చువారున్న
నయ్యలు మహనీయు లాసించి యేమి
యడిగిన లేదు పో యనరాదు సుమ్ము
కడుపునఁబుట్టిన కన్నియనైనఁ
కండలు కోసైనఁ గనులు తీసైన
గుండెలు తఱిగైనఁ గొడుకుఁ జంపైన
నిల్లాలి నడిగిన నివ్వఁగవలయు
వల్లభ, యింతటివాఁడైతివేని
మఱి యందు మీభూతి మాచేత ననిన

బసిఁడియా నివ్వాళిపళ్లెంబు నిచ్చు
క్రమమున నుదయించెఁ గమలబాంధవుఁడు
కమలముల్ వికసించెఁ గలువలు మొగిచె
వనితలు చరియించి వాడవాడలను
గనకకుంభములతోఁ గస్తూరిఁగలపి
యంగళ్ల వాకిళ్ల నలుకులుచల్లి
ముంగిళ్ల ముత్యాల ముగ్గులువెట్టి
గంధర్వ యక్షులు గానముల్ సేయ
సంధ్యాది విధులను సరగునఁదీర్చి
పలికినపంతంబు భక్తసమితికి
వెలయింతునని మంచివేళలో లేచి
హాటకమయమైన యారాజు కొల్వు
కూటంబు నతిచిత్రకూటమై యొప్పు
నిగనిగ మెఱయు విసీలకంభములు
పగడంపుఁ దిన్నెలు బంగారుచికిలి
యచ్చకస్తురిగోడ లందు చిత్తరువు
పచ్చకర్పూరపుఁ బలుకుల ముగ్గు
ప్రణుతింపరాని సోపానమార్గములు

ప్రథమాశ్వాసము

మణిమయంబైనట్టి మదురులచూరు
చూరువెంటను బెద్దచుక్కలంతేసి
పేరైన ముత్యాలపేర్లు కుచ్చులును
కుచ్చులకొనలను గోమేధికములు
పచ్చలు కెంపులు పద్మరాగములు
నంతరాంతరముల నలర నిబ్బంగి
పింతలఁ గైసేసి వెలయు గవాక్ష
ములచేత విలసిల్లి మునుకొని హేమ
కలశంబులను మించి గగనంబుముట్టి
దినకరశతకోటిదివ్యదీప్తులను
గొనకొన్న యా రాజుకొలువుకూటమున
భూజనములు చూడ బురుహూతుఁబోలి
రాజిల్లు భల్లాణరాయఁడే తెంచి
వరరత్నభూషణావళులు దీపింపఁ
దరమైన కర్ణపత్రములు శోభింప
మకరకుండల రత్నమకుటంబు మెఱయ
వికసితవదనుఁడై విడెము సేయుచును
శివపదధ్యానియై శివయోగమునను

శృంగార భల్లాణ చరిత్ర

నవరత్నసింహాసనస్థుండై యున్నఁ
దెరఁగొప్ప ఛప్పన్న దేశాధిపతులు
ఇరువంకలను డాసి యిష్టమై కొలువ
హితులు మంత్రులు పురోహితులు సేవింప
నతివశిరోమణి యాకుఁ జుట్టేసుఁ
గరకంకణాదులు ఘలుఘల్లుమనఁగ
సరసత్వమున సఖుల్ చామరల్ వీవ
బలుముష్టిగల జెట్లు పాదంబు లొత్త
బలములు సేవింప భట్లు నుతింపఁ
గల్లరి రిపుగజ కంఠీరవుండు
భల్లాణరాయండు పలికెఁ బంతంబు:
'వినుఁడి యాస్థానంబు, విశదంబుగాను
మనమున నే నొక్కమాట యూహించి
యనువొందఁ బలికెద నవనిలో నన్ను
నెనసిన వాంఛల నేమైనఁగోరి
యడుగనిజంగాని కలరఁగే నొట్టు
నడిగిన లేదన్న నాయొట్టు తనవు'
ననియిట్లు చాటింప నష్టదిక్కులను

ప్రథమాశ్వాసము

విని జంగమయ్యలు వేడ్కఁ లింపొంద
మును లాదిగా దివ్యమూర్తులతోడ
జననాథు వీటికిఁ జనుదెంచువారు:
జడముడిబసవయ్య చంద్ర చూడయ్య
విడిగంట చిక్కఁయ్య భీమలింగయ్య
పర్వతనాథయ్య పరమయోగయ్య
నిర్వాణసోమయ్య నీలకంఠయ్య
చరలింగదేవయ్య చన్నవీరయ్య
మరుళయ్య గురువయ్య మలికార్జునయ్య
బోడయ్య శివ్వయ్య పులిబోనమయ్య
మేడయ్య నందయ్య మెట్టసంగయ్య
విరుపాక్షదేవయ్య విశ్వనాథయ్య
కరపాత్రసిద్ధయ్య కనకాంబరయ్య
గురులింగదేవయ్య కోటీశ్వరయ్య
శరభయ్యమొదలైన జంగమ్మకోట్లు
కక్షపాలలు మంచి కనకదండములు
భిక్షపాత్రలు చిన్న పెద్దజోలెలును
కాలిపాకగంటలు కుఱుచదండములు

పులిచర్మములు దివ్యభూతిపూతలును
పదకములగజ్జెలు పసిడిపావాలు
రుదురాక పేరులు రుద్రమాలికలు
యోగపట్టెలు మంచియోగదండములు
శ్రీ గురుమూర్తులై చెలఁగు శంఖములు
చిమ్మటవాద్యముల్ శ్వేతశుక్కములు
గుమ్మటిదండెలు కూర్మవీణెలును
పిడిగంటలును బెక్కుబిరుదువాద్యములు
బడిబడి కుంచెలు బసవ శుక్కములు
ప్రణవనాదమునించు బారిసంకులును
గణుతింప నీరీతిగల జంగమములు
పుడమి యీనినయట్ల భువియెల్ల నిండి
నడలింగమూర్తులై నగరంబుఁజొచ్చి
యారాజవరుఁజూచి యయ్యలిట్లనిరి:
యీరోగి, మాకు నభీష్టంబులైన
యన్నవస్త్రంబులు నాభరణములు
జున్ను నేయునుమంచి జుఱ్ఱుపాయసము
ధనధాన్యరాసులు తగినగ్రామములు

కనకాంబరాదులు కట్టువర్గములు
మాసీమలో లేని మణికుండలములు
రాసికప్పెరలును రాగిబిందెలును
హయగజరథములు నావు లెద్దులును
గయిచూఱగా మాకుఁ గలిగినకొలఁది
వినయోక్తితోఁ దేరవిడెము బూదియయు
ఁని యిట్టు లడిగిన యయ్యల కెల్ల
నెడపక నిచ్చలు నిచ్చుచు రాఁగ
నొడయలు సంతోషమొందుచునుండి
రంతట నొక్కనాఁడు డాదరమునను
సంతోషచిత్తుఁడై సంయమీశ్వరుఁడు
నారదమునియును నయ ముప్పతిల్ల
నారాజవరుఁగాంచి యభినుతిసేసి
రాజాధిరాజ, యోరాజ, సర్వజ్ఞ
భోజ కళాధామ, భుజబలభీమ,
గానశాస్త్రవిలోల, కవిబుధపాల,
భానుకులాగ్రజ, భల్లాణరాయ,
పుడమిలో నినుఁబోలు పుణ్యాత్ముఁడేఁడి

యడిగిన లేదు పొమ్మనక యయ్యలకు
నిచ్చగా నేమైన నీయఁ జూచితివి
మెచ్చితి నిను మూఁడు మెచ్చుల ననుచు
మాణిక్యమయమైన మహతియఁ జేతి
వీణియ శ్రుతిఁగూర్చి విశ్వేశుమహిమఁ
బాడంగ విని సోలి భల్లాణుఁడపుడు
వేడుకపడి చాల విస్మయంబంది
చాలుచాల్ బాపురే! సన్మునీ యనుచు
లాలనతో నిచ్చె లక్షహొన్నులను
కట్నంబు లిచ్చినఁ గైకొని తపసి
పట్నంబు వెలువడి భక్తిమార్గమునఁ
గైలాసమున కేఁగి కడుసంభ్రమమున
ఫాలాక్షు నిజరాణిఁ బార్వతిఁ జేరి
కరమొప్ప హస్తపంకజములు మోగిచి
శరణార్థిఁ జేసిన శాంభవి పలికె
నెక్కడనుండి మునీంద్ర, యీరాక
యక్కడ గలవార్త లన్నియు మాకు
వినుపింపుమన్న నావేసాలతపసి
వినుపింపఁ దొడఁగె నావృత్తాంతమెల్ల

శ్రీః

శృంగారభల్లాణచరిత్ర

ద్వితీయాశ్వాసము

ఓతల్లి, వినుమమ్మ, యుర్వీపైనుండీ
భాతిగా మిముఁజూడఁ బని కల్గెనమ్మ,
ఆ భూమిపై నున్న హరభక్తవరులు
వీభూతిధారులు విధికైనఁగాని
వెఱవకున్నటువంటి వీరశైవులును
దఱచుగా నున్నారు ధర పెక్కుటిల్ల
మఱియొక శివభక్తు మహిమఁ జూచితిని
గరమొప్ప నాసింధు కటకంబు నేలు
భల్లాణుఁ డనురాజు భక్తి నుప్పొంగి
యుల్లంబు రంజిల్ల నొక్కచిత్తమున
నడుగని జంగాని కలరంగనొట్టు
నడిగిన లేదన్న నాయొట్టు తనకు

నని యిట్లు గర్వించి యాడంగ వినియు
వనజాక్షి యెఱిఁగింప వచ్చితి నీకు
నన విని పార్వతి యాశ్చర్యమంది
ఘనినాథుఁ గరుణించి ముదమున లేచి
వనితలు సేవింప వైభవోన్నతులఁ
దన విభుకడ కేఁగి తాత్పర్యమునను
గరమర్థితో మ్రొక్కి కఱకంఠుకనియె
హరినేత్రపూజిత యమరేంద్రవినుత
పురహర సర్వేశ భువనప్రకాశ
నరలోకమందార నామనోహర
సకలలోకాధార శరభావతార
యొకవార్త విని యేను నొనర నీకడకు
వచ్చితి నాపిన్నవాక్యంబు వినుము
మెచ్చిన నిచ్చెదు మేనైన సగము
ఇచ్చినఁ దప్పవదెంత యీవైన
మెచ్చనేర్చినయట్టి మీనాంకహరుఁడ
వింట నిన్నొక్కఁడు వెఱవక మోదెఁ
గుంటెన నిన్నంపెఁ గొనరొక యొకఁడు

ఇంటఁ గావలియుంచె నెలమి నిన్నొకఁడు
కంట నిన్నొక్కఁడు కదిసి పూజించెఁ
కొడుకు నొక్కఁడు మీకుఁ గూరగాఁజేసెఁ
బడిరాళ్ల ఋవ్వెను వరుస నిన్నొకఁడు
తరమిడి సీమీఁద దండెత్తె నొకఁడు
గురుతుగా రోఁకటఁ గొట్టె నిన్నొకతె
ఘనతతో సుతునిగాఁగనియె నిన్నొకతె
వనిత ప్రాయము వచ్చి వలచె నిన్నొకతె
యెంగిలంబలి యిచ్చి యేనసె నిన్నొకఁడు
వెంగలిగా నిన్ను వెలివేసె నొకఁడు
బటువుగాఁ దొడలపైఁ బవళించె నొకఁడు
ఇటువంటి భక్తులు నెందైనఁ గలరె?
అటుగాక యింకొక యాశ్చర్య మిపుడు
నిటలాక్ష, భల్లాణ నృపకులోత్తముఁడు
ఎడపక జంగమం బేవస్తువైన
నడుగకుండిన నొట్టు నడిగిన లేదు
అనినచో నాయొట్టు నఖిలంబు వినఁగఁ
దనకని గర్వించి దండితో గంట

మొగసాలఁగట్టించి మ్రోయించు కొనుచుఁ
జిగురెక్కియున్నాఁడు సింధురకమున
నాతని నిజభక్తి నలరంగఁ దెలియ
భూతేశ యట వేగమునఁ బోయిరమ్మ
అని విన్నవించిన యంబికమాట
విని నవ్వి శంభుండు వేడుకనొంది
నలినాక్షి సింహాసనస్థనుగాను
కొలువులోఁ దొడలపైఁ గూర్చుండఁజేసి
కరుణాకటాక్షుఁడై గౌరితో ననియె
గిరిజ, మాభక్తుల కీర్తిసాహసము
లరుదొంద హరికైన నజునికి నైన
శిరములు వేయున్న శేషునికైన
నిర్ణయింపఁగరాదు నిఖిలలోకముల
వర్ణింపఁదరమె యెవ్వరికైనఁగాని
నాకన్న నధికులు నాభక్తవరులు
లోకలోకములన్ని లోఁగొనఁగలరు
విధికైన వెఱవని వీరమాహేశు
లధికులు వారేమి యడిగినఁజెల్లు

వారెల్ల నింతేసివారౌట వినవె
వారిజగంధి నీవాక్యంబు వినియు
నూరకుండుట మాకు నుచితంబు గాదు
ఆరాజవరుభక్తి నలరంగఁదెలిసి
వచ్చెదఁ దోడ్కొని వామాక్షి, నీవు
నిచ్చట నుండు మీయింతులు గొలువ
నని యిట్లు సర్వేశుఁ డా గౌరిదేవి
మనసు సమ్మతిసేసి మహిమతోడుతను
హరివిరించ్యాదుల నటువీడుకొల్పి
సురలను బనిపుచ్చి సొంపుతోఁగొల్వ
పాలించి యంతట శర్వాణి పంప
కైలాసముననుండి గౌరీశ్వరుండు
పుడమికి వెస డిగ్గి భువనంబు లెఱుఁగఁ
గడువేగమున సింధుకటకంబుఁ జేరి
దీపింప రవికోటి దేదీప్యమాన
మాపట్టణముఁ జూచి యాశ్చర్య మంది
నిజరూప మటుమాని నీలకంధరుఁడు
భజనతో నారాజు పట్టణంబునను

వారకామినులున్న వాడలకేఁగి
వారకాంతలఁ బిల్చి వలసినధనము
నిప్పించి యొక్కొక యింతికి విటుని
నొప్పుగాఁ గావించి యుంచిన విటులు
కామినీమణులతోఁ గామభోగముల
శ్రీమంతులై యుండఁజేసి యాలోన
నుదయకాలమునందు నొప్పిదంబైన
పదివేలసూర్యులప్రభలు చెన్నొంద
విరుపాక్షుఁడును నొకవిటజంగ మయ్యె
కురులు నున్నఁగ దువ్వి కొనగోళ్లచేత
ముంగలిసిగ వేసి మురువుగాఁ గొనలు
చింగురంగులువార సిగను దామెతులు
పొగడపూవులదండఁ బొందుగాఁ జుట్టి
మొగలిరేకులు మాని మొల్లలు దురిమి
తెలివిగాఁ గస్తూరితిలకంబు దిద్ది
వలపుమై బూదియు వేన్నిగాఁ బూసి
బంగరుచెఱఁగుల పట్టంచుదట్టి
చింగులువారంగఁ జెలువుగాఁ గట్టి

ద్వితీయాశ్వాసము

యురుసజ్జలింగంబు నురమునఁ దాల్చి
మురుగుముద్రలు తీయ మోవిపైఁగాట్లు
చెక్కుల శశివంక చిన్నారిగోళ్లు
వక్కలాకులసంచి వలెవాటుశాల్వ
చెంపలగంధంబు చేత సంకుశము
సంపెంగపూబంతి సరిపెణగొలుసు
లందె పెండెరము రుద్రాక్షమాలికలు
మందు కాటుకబొట్టు మణికుండలములు
నీలాలపోగులు, నిక్కకన్బొమలు
వాలారుగోళ్లును వాఁడిచూపులును
బదముల సిరిగజ్జె పసిఁడిపావాలు
మదనవికారంబు మైనిండఁ గలిగి
మొల వంకకత్తియు ముంజేత జోలె
సెలవులఁ జిరునవ్వు చిన్నారిచెమట
వరశిష్యులై భక్తవరులు గొలువఁగ
మరులుగొల్పెడు విటమార్గుఁడో యనఁగఁ
బుక్కిటఁ దమ్ములంబుఁ బుష్పమాలికయు
నక్కడ నొకశిష్యుఁ డాకుఁ జుట్టియు

శృంగారభల్లాణ చరిత్ర

నాడాడ నొకశిష్యుఁ డద్దంబుఁ జూప
నీడఁ జూచుచు నంత నిలిచి మురియుచు
బలుతీరు ముఖకాంతి భావించి చూచి
మొలిగొన మీసాలు మెలిచి దిద్దుచును
నొఱపును మెఱపును నొయ్యారివగలు
విరియశంకరుఁడిట్లు విటరూపుఁ దాల్చి
లంజెలకాముఁడై లలితముల్ సేసి
మంజరిఁ జదువుచు మహిమతో రాఁగ
నాసీమజనులెల్ల నటు చోద్యమంది
యేసీమలోఁజూడ మిటువంటివిటుని
నీవింత యీబాగు నీచక్కఁదనము
నీవన్నె యీపూఁత యీజాణతనము
నీనగ వీపెంపు నీసొంపు నీటు
నీనటనంబులు నీమగతనముఁ
గందుసందును లేని కళలను నిండు
చందమామను మీఱఁ జాలియున్నాఁడు
ఈజంగమును జూచి యెవ్వతెయైన
నోజమాలియు వెంట నుఱుకు నన్నారు

మనసు మెత్తనిదైన మగనిఁ బోవిడిచి
వెనువెంటనేపోవు వెలవ కన్నారు
పదిలము గలిగిన పడఁతియమైన
నదియేల పోయెదు ననియెడువారు
మానంబు గలయట్టి మానినియైన
యూని ద్రవింపక యుండ దన్నారు
ఈరాజఋషిఁ గాంచి యేసాధ్వియైన
కోరి తానయి చేరకుండ దన్నారు
వనితలగుణము లెవ్వరు కన్నవారు
మనసు పారక పోదు మగవానిఁ జూచి
మతిమంతుఁడై వేద్యమనపురిఁ జేరె
నితఁడెవ్వఁడో కాని యెఱుఁగంగరాదు
చిత్తజుఁడేమొ యీచిన్నెలవాఁడు
చిత్తజుఁడయినను జెఱకువిల్లేది
యింద్రుండు కాఁబోలు నీవగలవాఁడు
ఇంద్రుఁడైనను గన్నులేవి మైనిండ
బ్రహ్మ కాఁబోలు నీబాగులవాఁడు
బ్రహ్మయైనను నాల్గుబాహులు నాల్గు

శిరములుఁ బుక్కిటఁజెలఁగ దే వాణి
పరికింప నీతఁడు బ్రహ్మయుఁగాఁడు
జలజాక్షుఁడేమొ యీజాడలవాఁడు
జలజాక్షుఁడైనను శంఖచక్రములు
తిరుమణి కస్తూరితిలకంబు లేవి
యరయంగనీతఁడు హరియును గాఁడు
భల్లాణరాయనిభక్తి వీక్షింప
చల్లమా దేవమ్మ సత్యంబు నరయ
హరుఁడేమొ యీరూప మమరంగఁ దాల్చి
యరుగుచు నున్నవాఁ డవును దథ్యంబు
అని యిట్లు పురజను లాడునీలోన
మనసిజహరుఁడేఁగి మానవాధిపుఁడు
కొలువున్న మొగసాల గొబ్బునఁజొచ్చి
నిలిచియున్నంతలో నిజగురుఁగాంచి
భల్లాణరాయఁడు భక్తితో లేచి
యుల్లంబురంజిల్ల నొక్కచిత్తమున
శరణార్థియని మ్రొక్కి సన్నుతిసేసి
యరిమురి సింహాసనాసీనుఁజేసి

ద్వితీయాశ్వాసము

యాదటనర్ఘ్య పాద్యాదు లొనర్చి
పాదచారిగనున్న భల్లాణుఁజూచి
కక్షపాల విభూతి కరమునఁ బట్టి
పక్షమై ధరియింప భల్లాణుఁడనియె
నేను ధన్యుఁడనైతి నెల్లలోకముల
నేను ధన్యుఁడనైతి నిహపరాదులకుఁ
బన్నగా నేఁడు మీపాదపద్మములు
కన్నులారఁగఁ జూడఁ గలిగె నేఁడనిన
నారాజుక్షేమంబు నంతయు నడిగి
మారారి సంతోషమగ్నుఁడై యుండె
నావేళ మంత్రులు నాయయ్యవగల
భావించి వీక్షించి పరిభాష ననిరి
గురులింగ, యేభూమిఁగోరివచ్చితిరి
యొఱపును మెఱపును నొయ్యారివగలు
ముఁకపంపునటనయు మోవిపైఁగాట్లు
చిఱునవ్వు చెక్కిళ్లఁ జిన్నారిగోళ్లు
నల్లని పలుఁగఱ నకునెత్తి సిగయు
మొల్లపువ్వులదండ మొల వంకకత్తి

చెంపలఁ గంధంబు చేతను సురఁటి
యింపును సొంపును నిది చరలింగ
నీకుఁ జెల్లునుగాక నిఖిలలోకములఁ
జేకొననొరులకుఁ జెల్లునే యనిన
చేతిలోఁ జేవైచి శివుఁడటు నవ్వి
చాతుర్యమునఁ బల్కె సభయెల్ల వినఁగ
ఘనతరంబగు తల్లిగర్భగోళమున
జనియించుటకు విశేషం బిది కాదె?
వారకాంతలఁజూచి వదలనేమిటికి?
కోరిక పారిన గుదెఁ బట్టనేల?
పంచేంద్రియంబుల బంధింపనేల?
ఇంచువిల్తునిబారి కీగంగనేల?
కలలోన సతులను గామించనేల?
స్ఖలితుఁడై కర్మలఁ గట్టువడనేల?
స్నానజపమ్ములు సలుపంగనేల?
కానలలోఁ దిరుగాడంగనేల?
పరదేసులై గుళ్లపంచలఁ జేరి
పొరలాడినందునఁబు పుణ్యంబు లేదు

మదనకేళులయందు మమత లుప్పొంగ
ముదితల కుచకుంభములమీఁదఁజేయి
వేసుక యతివీర్యవృద్ధులచేత
వేసట లేకుండ వేశ్యలుఁదాము
వింతవర్తనముల వివిధబంధముల
సంతతరతికేళి సంయుక్తులగుచుఁ
బువ్వులశయ్యలపయి భోగభాగ్యములఁ
బవళించిన సుఖంబుఁ బరమంబు గలదు
కామశాస్త్రములందుఁ గామిగావచ్చు
కామిగానట్టి నిష్కాముఁ డెవ్వండు?
కామిగాఁడా తొల్లి గౌరీశ్వరుండు
కామిగాఁడా తొల్లి కంసమర్దనుఁడు
కామిగాఁడా తొల్లి కమలగర్భుండు
కామిగాఁడా తొల్లి కమలబాంధవుఁడు
కామిగాఁడా తొల్లి కలువలరాజు
కామిగాక మోక్షకామిఁ గాలేఁడు
ఈమాట విని నేను నీ రూపుఁ దాల్చి
వేమాఱు భక్తుల వేశ్యల నడిగి

పుట్టి నే విటుఁడనై భోగింతు నిత్య
రట్టడి సంగమరాజును నేను.
అనవినిమంత్రులు నౌనయ్య యనిరి
పనిపూని సెలవులు వాఁడ నవ్వుచును
ఉన్న జంగముఁజూచి యుర్వీశుఁడనియె
అన్నివిద్యలు జంగమయ్యలసొమ్ము
జంగంబు నోరయుట సంగతికాదు
జంగంబు నా ప్రాణ సల్లింగమూర్తి
జంగంబు నాపాలి సర్వేశ్వరుండు
లింగార్చనము సేయు లెమ్మని పలుక
జననాథుఁ గనుఁగొని జంగ మిట్లనియె
ననఘాత్మ! మారాక నర్థితో వినుము
అన్నంబుపై మాకు నాశయు లేదు
వెన్నెలతేటైన వేశ్య కావలయు
లంజెలేని దినంబు లక్షైనఁగాని
గంజి నోటికిఁబోదు ఘనుఁడ నీయాన
యున్నమాటలు మాకు యువిద్య దెమ్మనుచు
విన్నవించిన రాజశిఖుఁ డిట్టులనియె

ద్వితీయాశ్వాసము

రావయ్య, జంగమరాజశేఖరుడ,
నావిన్నపము విను నా ప్రాణలింగ
యొడయ నీ కీమాట యుచితంబు గాదు
అడుగుము మఱియు నేమైన నిచ్చెదను
వెలయాలి నడుగంగ విహితంబు గాదు
అలిగి హాస్యము చేతు రయ్యలు వినిన
నీకుఁగోరికయున్న నింపుసొంపైన
శ్రీకరంబైనట్టి చెలువను దెచ్చి
పెండ్లి చేసెదఁగాని పెండ్లాడు మీవు
ఇండ్లు గట్టుక యుంతు మెల్లభోగముల
రాసిక ప్పెరలు నా రాజ్యంబునందు
వాసిగా నిప్పింతు వర్షాశనంబు
పెండ్లికి నొక్కొక్క పెద్దటంకంబు
ఇండ్లిండ్లవారిచే నీయఁ జేసెదను
వారక శివభక్తవరుల రప్పించి
వార మిప్పింతు నీవద్ది శిష్యులకు
పోకలు గొనకుండ పూని సాగితు
చేకొన నీలాగు చెల్లు నయ్యలకు

శృంగార భల్లాణ చరిత్ర

నిది నీకుఁ దగదన్న నేనేలు రాజ్య
పదవిలో సగపాలు పంచి యిచ్చెదను
నన్ను లాలన చేసి నామాట వినుము
ఉన్నిమాటలు మాను మోస్వామి యనిన
నామాట విని జంగమయ్య కోపించి
యేమిటి కీవార్త భూమిప, వినుము
పెండ్లేల, గిండ్లేల, పేరంట, మేల?
యిండ్లేల, గిండ్లేల, యీరవ్వ యేల?
యాడేది యొక్కటి యసిమిఁలో నొకటి
కూడునే యిటులాడ గురునాథుతోడ
జగబిరుదముఁ గొని సందు లీగెదవు
తగ దొట్టు నీకును ధరణీశ, మాను.
బండాటములు మాతో పచరింపవలదు
బండారు గొమ్మనిపట్టపు సెట్టి
యిలు చూరఁ గానిచ్చు నీసామ్యమయ్యె
వెలయాండ్రు నీయూర వెలితియైనారొ
పెండ్లిమాడల నొలిఁబ్బెట్టి యొక్కతెను
పెండ్లిచేయుటకన్నఁ బృథివీశ వినుము

కాసుఁబెట్టిన లంజె కలదు చక్కనిది
కాసీయఁజాలక కల్లలాడెదవు
నాచేతి కాసైన నరనాథచంద్ర
నీచేత నందుక యీచేత నాకుఁ
దెప్పించు వేశ్యను దెలివైనదాని
తప్పక శివభక్తి తడవేల యనిన
నొడయని మనసురా నర్వీశుఁడనియెఁ
గడువేగమున వారకాంతను మీకుఁ
దెప్పింతు నిప్పుడే దేవ నీయాన
యొప్పితి ననినను నొడయఁడిట్లనియె
జననాథ నామాట చక్కఁగా వినుము
పనికిమాలినదాని, బానిసదాని
నుర్వీశ తెప్పింప నొల్లను సుమ్మి
గర్వాంధురాలైన కాంత నేనొల్ల
మిక్కిలి పొడవైన మిగులఁగుర్చైనఁ
బెక్కుమాటలదైన బీదగొట్టైన
ఇచ్చ యెఱుఁగనిదైన నెడ్డదియైన
మెచ్చనేరనిదైన మొల్లచూపైన

నిముదపండ్లదియైన నిద్రపోతైనఁ
బదుచండ్లదైన దూబరదిండియైన
బడపుడిగినదైన బదుగుదియైనఁ
గోడవపోతైన నిండుదు చండ్లదైన
చెండిపోతైనఁ దుచ్చెపులాగుదైనఁ
గండ్రకొవ్వినదైన గదుసురాలైన,ఁ
జిత్తులైనను జెమటకంపైనఁ
దెబ్బనోటిదియైన దిండిపోతైనఁ
జొల్లునోటిదియైన సోమరియైన
నల్లరూపుదియైన నాతి నేనొల్ల
వినయంబులేనిదై వేడ్కలుమాని
ధనవంతురాలైన దాసి నేనొల్ల
విటునిచే ధనమంది వే మఱియొక్క
విటు కిఁ జేసాచు వేశ్య నే నొల్లఁ
గలహించి విటునకుఁ గౌఁగిలీయకయు
మలకలు వెట్టెడు మగువ నేనొల్ల
చెక్కిటఁ జెయి సేర్చి చిన్నపోవుచును
మొక్కలంబైయుండు మఁదిత నేనొల్లఁ

ద్వితీయాశ్వాసము

బసరచ్చుమ్రవలెఁ బచ్చుపైఁబవ్వళించి
బుసకొట్టుచున్నట్టి ఘాలఁతి నేనొల్ల
మదనకేళులయందు మన మింతలేక
వదరుచు నిద్రించువనిత నేనొల్ల
గూటము లీయక కుములుచు వట్టి
మాటలఁ బ్రొద్దగు మానిని నొల్లఁ
బురుషుఁ డలసినంతఁ బొదలుచు మీఁద
సురతంబుచేయనిసుదతి నేనొల్ల
చిత్తంబు నొరులపై జేర్చియున్నట్టి
చిత్తినిజాతైన చేడియ నొల్ల
కుస్తరించక విటు కొడువల నెన్ను
హస్తినిజాతైనయతివ నే నొల్ల
బొంకులకుంచమై పురుషునిరతుల
జంకించు శంఖినిజాతైన నొల్ల
పద్మాకరంబన భాసిల్లునట్టి
పద్మినిజాతైన భామ కావలయు
భవిఁ బిల్వనేరని పణఁతి కావలయు
శివభక్తురాలైన చెలియ కావలయు

రమణి యీ రేశివ రాత్రిగా నన్న
క్రమ మొప్ప వేగించు కలికి గావలయు
మఱి యిన్ని గుణములమానిని వలయు
ధరణీశ తెప్పింపు తగినట్టి దాని
నీ మన మొప్పిన నెలంత యేదైన
నా మన మొప్పును నరనాథచంద్ర!
అనవుడు వినియు రా జట్లకానిమ్ము
యనుచును సంతుష్టుండై తలవర్ల
రప్పించి యిట్లనె రాజశేఖరుండు:
యొప్పులకుప్పైన యొక వారకాంత.
కావలె విటుండున్న కలికి గాకుండు
తేవలె జంగమ దేవర కిపుడు
యని యిట్లు భల్లాణుండాడు వాక్యములు
విని యాటు తలవర్లు వేశ్యను వెదకి
తరలివచ్చిన యట్టె తదనంతరమున
బరమాత్మ నిజరాణి పార్వతిందలచి
భల్లాణరాయుని భక్తి శంభుండు
తెల్లమిగా నేడు తెలిసెనో లేదొ

యని యిట్లుచూచుట కనుపుచందమున
ననఘు చంద్రోదయ మయ్యెనంతటను
పండువెన్నెల పట్టపగలయి కాయ
మండలాధిపుఁడేలు మహి నొప్పుపురిని
తలవర్లు వేశ్యకై ధనములు గొంచు
వెలయాండ్రు రున్నట్టివీథులకరిగి
బండారువారింటి పడఁతి రమ్మనిన
ముండజంగ మొకండు మెదలక యింట
నున్నాఁడు రాఁగూడదోయి, పొమ్మనిన
చిన్నెలవారింటిచిన్ని, రమ్మనిన
నీటుగా నొకజాణ నిదురకున్నాఁడు
కూటంబు విడిచి రాఁగూడ దనంగ
బారిసంకులవారి పాపి, రమ్మనిన
రారాదు విటుఁబాసి రాను పొమ్మనిన
కనకదండెలవారిక్షామి, రమ్మనిన
ఘనతగా నొకలంజెకాఁ డున్నవాఁడు
రాఁగూడ దీవేళ రాను పొమ్మనిన
మూగాలవారింటి ముత్తి రమ్మనిన

రోవెల నొక్కండు రూఢిగా నిచ్చి
యీవేళ నున్నాఁడు యేనురాననిన
కిన్నెరవారింటికేసి రమ్మనిన
నున్నాఁడు ననుఁగూడి యొకభక్తుఁడనిన
మద్దెలవారింటిమల్లి రమ్మనిన
యొద్దికనున్నవాఁ డొకజంగమయ్య
యేటికిఁ బిలిచెద రేను రాననినఁ
బాటికుంచమువారి బామ రమ్మనిన
నీటుగా నొక్కండు నిద్రకున్నాఁడు
నేఁటికి నేరాను నీయాన యనిన
వారకామినులున్న వాడవాడలను
ఈరీతి నడుగుచు నిల్లిల్లు సొచ్చి
నమ్మిక వెదకంగ నాతులు విటులు
నెమ్మది నుండంగ నిలువక పఁగుడి
జననాథుఁగనుఁగొని జంగమవిభుఁడు
వినకుండ మెల్లన వినిపించిరపుడు
భూరిసద్గుణ సాంద్ర భోగదేవేంద్ర
ధీరభల్లాణేంద్ర ధృతిపన్నగేంద్ర

పన్నుగా నీవేలు పట్టణమందు
నిన్నాళ్లు వేశ్యలు నెటువంక జూడఁ
బడిగాపులుగఁ గాచి పడియుందురయ్యా,
పుడమిాశ నేఁడైన బుట్టదులంజె
యొంటినున్నది, లేదు యొక్కొక్కవిటుని
నంటుకొనున్నవా రంద ఱిండిండ్ల
నీరీతి నుండఁగా నేమును వెఱచి
వారకామినిఁ దేకవచ్చితి మనిన
దలవర్లమాటలు తథ్యంబు లనక
కొలు వటు చాలించి కొంకక లేచి
గతినెన్ని యొకనల్లకంబళిఁగప్పి
ఇతరు లెవ్వరుఁ దన్ను నెఱుగరాకుండ
వారకామినులున్నవాడ వాడలకు
నా రాత్రి దానేఁగి యాలంజె లిండ్ల
చాటున నిలుచుండి చప్పట్లు వినుచు,
మాటలఁజెవి యొని మఱివించురాగఁ
బాలమల్కచేతఁ బ్రొద్దులుపుచ్చు వారు
నలకలన్నియు మాని యులరెడువారు

పువ్వుఁబాన్పుల మీఁద భోగించువారు
పవ్వళించి సతులఁ బాయనివారు
కరకంకణాదులు ఘులు ఘుల్లుమనఁగ
మరుకేళిఁ బెనఁగుచు మసలెడువారు
సిగ్గింత లేకను జీరలు విడిచి
యగ్గించి రతి సల్పియలరెడువారు
మోము మోమునఁ జేర్చి ముద్దులుగొనుచుఁ
బ్రేమచేఁ గౌఁగిళ్లఁ బ్రేరేచువారు
కొప్పులువిడి జారఁ గుచములు, నదరఁ
జిప్పిలి మయిపట్టు చెమరింపఁగాను
కరకంకణాదులు ఘులు ఘుల్లు మనఁగ
మురిపంపుముంగురుల్ మోమునఁ గమ్మ
నుపరతిబాగుల నుండెడివారు
కపటంబులనుమాని కలసెడువారు,
తూగుటుయ్యేలలలోఁ దూఁగెడువారు,
తూఁగితూఁగి రతులఁదోఁగెడువారు
దివియగంబము నాల్గుదిక్కుల వెలుఁగఁ
బవళించి తమయంగభావము నెల్ల

కానరాఁగనుజూచి స్ఖలితులై యలసి
మాడ కెప్పటియట్ల మరి యున్నవారు
నొకొక్క వేశ్యకు నొకొక్కవిటుఁడు
నక్కడఁబొల్పడి యటులున్నవారు
యెవ్వెడఁ దమతమ యిరవులఁజేరి
శయ్యలపై వేడ్క శయనించువారు
లకు ముకి పక్షులలాగునఁగదిసి
ప్రకటించి చౌసీతి బంధానుగతుల
వీర్యవృద్ధులచేత వేశ్యలు దాము
కార్యస్థులై యిట్లు కామభోగముల
నున్నవారలఁజూచి యుర్వీశ్వరుండు,
వన్నెగా మఱియొక్కవాడను జూడ
నీలాగె యుండుఁగా నిల్లిల్లు వెదక
నాలోన భల్లాణుఁ డటు వేగుదేర
లంజెకునై పొమ్ము లంజెల తల్లి
ముంజేతికి నొసంగి పొమ్మన్నఁబోక
నుండఁగా నాలంజె యూఁకించి తన్న
గొండి నొచ్చియు, వాఁడు రొదగొని మూర్ఛ

నచ్చోట నొక్కని నా లంజెతల్లి
ఇచ్చింది పస లేమియింత ప్రొద్దాయె
వెళ్లరోరి యటన్న వేశ్య యిట్లనియె
నల్లుని నోరోరి యనరా దటన్న
వాఁడేఁడఘల్లుఁడే వదిరితే పండ్ల
నూడఁదన్నుదు నన్న నుర్వీశుఁడనియె
సంతపాకల కేల సత్యశౌచములు
వింతమాటలు వింటి విశ్వేశ, యనుచు
వీభూతిచేతుల వీనులు మూసి
యాభూమిపే డప్పు డావాడ వెడలి
తలవర్లమాటలు తథ్యంబు లయ్యె
పలికినపంతంబు పలుచనానేమొ?
ఎక్కడగలుగునో యీప్రొద్దు వేశ్య
యక్కటా నడుజాముఁ నాయెను బ్రొద్దు
అపకీర్తి సిద్ధించె నయ్యెచేఁ దనకుఁ
గృపలేక నామీఁదఁగెఁడెంచఁగలఁడు
యేమని బొంకుదు నింతి లేదయ్యె
నీమంబుబోకుండు నే శ్వేమినేస్తు

నామదిలో నేఁడు నలుకున పొడమె
సీమయేలెడు రాజసింహుండ ననుచు
బలిమి నెవ్వతెఁ దేరఁబాపంబుయశము
పలుచఁబారును శివభక్తికిఁ గొదువ
వెలయాట లేదని విటజంగమునకు
గులసతి నిచ్చినఁ గొదువంటఁగలదు
అంటిన నంటనీ యులర నేనింట
గొంటుజంగము కియ్యకొనివచ్చినట్టి
నే నాడు వాక్యంటు నిర్వహించెదను
మానఁబదియుఁ గాని మానమె యదియు
మానంబు ప్రాణంబు మావంశమునకు
దానంబుసేయుటె ధర్మమార్గంబు
తనదేవినే తెచ్చి దర్శింతుననుచు
ఘనతతోఁ దన యింటి కడకు నేతెంచి
చల్లమాదేవిని జయ్యనఁ బిలిచి
భల్లాణుఁడిట్లనె భక్తిమార్గమున.
వింటివా నేఁడొక్క విటజంగమయ్య
తుంటవిల్తునివైరి ధూర్జటిఁబోలి
నేవున్న కొలువుకు నిగుడి యేతెంచి

దీవించి ననుఁజూచి ధీరత నిలిచి
విభూతి ధరియించి వేశ్యఁ దెమ్మనిన
బ్రాభవంబున నేను బట్నంబుజొచ్చి
తలివర్ల నమ్మక ధవళాక్షి నేను
వెలయాలిఁ దేఁబోవ విటులను గలసి
యున్నవా రొకరైన నొంటిని వేరు
నెన్నఁడు నేఁజూడ నిట్టిచిత్రంబు
పురహరుమాయ గాఁబోలును నెఱుఁగఁ
బోరఁగూళ్ల కంపినఁబోయినవారు
నక్కడ నీలాగె నతివలు విటులు
నొక్కట్టియున్నవా రొంటి లేదనిరి
వ్రతము దప్పెను నేఁడు వామాక్షి నాకు
హితకరి వచ్చితివనుచు నాభక్తి
వలుచఁగాకుండ నుపాయ మేమిపుడు
వెలయాల్ను గావలె వే యిపుడనినఁ
జల్లమాదేవియు, శరణని పలికె
భల్లాణరాయ భూపాలశేఖరుఁడు
చరలింగమూర్తుల జాడలువినవె

ద్వితీయాశ్వాసము

చిఱుతొండభక్తుని శిశువుఁగూరగను
నడిగినభక్తులీ యయ్యలు గారె
కడు వేడ్కతో మానకంజాఱుబిడ్డ
కూ కటి గోయరాకుండరా దంచు
నాఁ కతో నడిగిరీయయ్యలుగారె
యరుదెంచి తొల్లిహలాయుధు నొక్క
యరమేను నడిగిరీ యయ్యలుగారె
పుడమిలోపల మున్నుఁబొదలె నిమ్మవ్వ
కొడుకును జంపియు కెఱకును బోయి.
యన్నంబునడిగిన యయ్యలుగారె
నిన్నునడుగుట యెంత నీభక్తిచూడ
నేవిధి నడిగిన నిచ్చుటే ఘనత
నావిచారంబేల నరనాథ నీకు
నావిన్నపము విను నాప్రాణనాథ,
నీవుచెప్పిన మాట నే దాఁటఁగలనె
యనవుడు భల్లాణుఁ డటు సంతసిల్లి
వనిత నక్కునఁ జేర్చి వడి నిట్టులనియె
ఓకులపావని, యోకీరవాణి,

యోకల్పభూజమ, యోచంద్రవదన,
యోమీనలోచన, యోహంసగమన,
నామాటమీఱక నాపాలఁగలిగి
నేఁటికి వేశ్యవై నిలిచి జంగముఁ
గూటమీవలె నీవు కొంకక యనిన
పతిమాటఁగైకొని పద్మాయతాక్షి
హితవర్తియై మ్రొక్కి యిలనాథు కనియె
భూనాథ, నన్నింత భూషింపనేల ?
నేను నీదాసిని నీవు నాపతివి
పతిమాటఁజేసిన బరమును గలదు
పతిమాటఁజేసినఁ బరగు సత్కీర్తి
పతిమాటఁజేసినఁ బావనం బొదవుఁ
బతిమాట మీఱినఁ బాపహేతువగు
నామానమునకును నాప్రాణమునకు
భూమీశ, కర్తవు భోక్తవు నీవు
నీమాటమీఱ నా నెఱిజంగమునకు
నోమహీపతి, వన్ను నొప్పింపుమనిన
విని రాజు మూర్ఛిల్లి వేగమె తెలిసి

మనమున సంతోషమగ్నుఁడై యువిదె
నీపురిలో వేశ్య లెందును లేమి
నీపూటకును నిన్ను నీయఁగావలసె
నీవంటి నిజభార్య నే నెందుఁజూడఁ
బావని, నామాటఁ బాయక నీవు
పలికినమాత్రనే పడఁతిరో, నిన్ను
నలజంగమయ్యకు నర్పింపఁదగునె!
సతిలేని పతియేల సంసారమేల
సతిలేని వ్రతమేల సద్గతియేల
ననవలసిపుడు నే నంటినిగాక
నినుఁబాసి క్షణమైన నిలువంగఁగలనె
మగువరో, నాదగు మనసుసమ్మతిగ
దగవైన యొకమాట దయచేయుమనుడు
మానినిరత్నంబు మగనితో ననియె
భూనాథ, యీతలపోఁతలు మాను
మీచిన్నివాక్యంబు లేటికి నీకు
నాచిత్త మరయఁగ నాథయడ్గితివి
సత్యసంధుఁడు హరిశ్చంద్రుండు తొల్లి

సత్యంబుఁదప్పక సన్మునికొఱకు
నాలిబిడ్డల నమ్మి యంత్యజుఁ గొలిచి
మాలఁడై వెనువెంట మధుమాంసములను
కావళ్లమోయంగఁ గరుణించి యంత
కానఁడా వారల గౌరీశ్వరుండు
నీమాట బొంకక నిర్వహించినను
సోమేశ్వరుఁడు దయఁ జూడంగఁగలఁడు
ప్రాణేశ, యీవేళ భక్తిపోకుండఁ
జెల్లించు నాకునై చింతింపవలదు
చింతలన్నియు శివచింతగాఁజేసి
యంతరంగము గట్టిదై యుండుమనిన
వారిజాక్షిని మెచ్చి వసుధేశుఁడనియె
నీరజగంధికో, నీచిత్తమంత
నోరసెడుకొఱకునై యొత్తిచూచితిని
ఇరువురిమానసం బేకమైయొప్పె
కోరినకోర్కులు కొనసాగఁగలవు
ధీరాత్మురాలైన దేవివి నీవు
ఈరూపమున నిన్ను నిచ్చితినేని

యీరాజఋషి నన్ను నెదలించఁగలఁడు
వారకామినిఁదేక వసుధేశ నీవు
సూరిలోఁబతిఁబాసి యొంటిగానున్న
మగనాలిఁ దెచ్చితి మాకేలయనునో
మగువరో, నీరూపు మాని యీక్షణమె
మారారిమననురా మఱి వింతగాను
వారకామినిరూపు వనితరో, నీవు
గైకొనిరమ్మని కడకుఁ బంపినను
నాకోమలాంగియు నవనీశు మాట
విని వచ్చి యంతలో వేశ్యాత్వమూనఁ
గనుఁగొని యామల్లికాదేవి యనియె
విరహార్తిఁగొన్నట్టి విటజంగమునకు
నరనాథుఁ డడిగిన నన్నుఁబంపకయు
మెలఁతరో నీవెట్లు మేకొంటివమ్మ!
తిలకింపఁ బట్టపుదేవివై యుండి
చులకని పనులకుఁ జార నీకుఁదగునె
వల దిట్టు లోయక్క, వారకామినిగ
నన్ను శృంగారించి నాథునికడకు

బన్నుగాఁదోఁకొని పదవమ్మ, యనిన
మల్లికాదేవిని మన్నించి చాలఁ
జల్లమాదేవియు సంప్రీతిఁబలికె
నాముద్దుచెల్లెల, నన్నుమీఁజేరివి
వేమరు నీబుద్ధి వేవేలుచేసు
నీవు నైనను నేమి నేనైననేమి
యీవేళ మనభక్తి యీడేరఁజాలు
లోలాక్షి నీమాట లోఁగొనిపంప
బాలవు మిక్కిలి ప్రౌఢవు గావు
విభునికౌఁగిటఁ నున్నవిధమును గాదు
సభ దాటవిటుఁడ యీజంగమేశ్వరుఁడు
వారకామినివలె వఁపించి చాల
కోరికదైవాఱఁ గూడుండవలయు
నేనియ్యకొనివచ్చి నిన్నంపినపుడె
ఆనరేంద్రుఁడు నన్ను నదలించఁగలఁడు
యని యిట్లు పిలదని యాచల్లమాంబ
ఘనతతో వేశ్యగాఁ గైసేయఁదొడఁగె

శ్రీః

శృంగార భల్లాణచరిత్ర

తృతీయాశ్వాసము

మునుపటి సొమ్ములు ముదమొప్పఁ దీసి
యనువొప్ప జలకంబులాడియు జిగ్గు
వలువ మైతడి యొత్తి వరచంద్రకావి
మిలమిల పావడమీఁద సన్నంపుఁ
జలువమైజరు చీరె చక్కఁగాఁగట్టి
నెలకొన్న జాళువా నిగ్గులరవికె
గబ్బిగుబ్బలమీఁదఁ గడువేడ్కఁదొడిగి
గొబ్బునఁ దడియార్చి కొనగోళ్ల చేతఁ
గురులు చిక్కెడలించి కొప్పమరించి
విరివిగ జాజిపూవిరులును దురిమి
పలుదోమి వింతగా పలుగఱచేసి
తెలివిగా బూదియఁ దిలకంబుఁ దీర్చి

పరిమళగంధంబు పైనిండ నలఁది
తెరఁగొప్ప మెఱుఁగులతీగె ధరించి
పటుచంద్రసూర్యుల పాపటబొట్టు
నిటలంబుపై వ్రేల నిలిపి కర్ణములఁ
గరమొప్ప రత్నాల కమ్మలు పెట్టి
కరముల వజ్రాలకడియముల్ పెట్టి
యాణిముత్తెపుఁ బేరు నలఱుతరించి
నాణెంపు బేసరి నత్తును బెట్టి
మొళఁ జిఱుగంటల మొలనూలు గట్టి
తెలిదమ్మితేకులఁ దెగడెడుముద్దు
కలికికన్నుల మంచి కాటుక పెట్టి
చిలుకలకొలికియై చేతఁబూబంతిఁ
జెలువొప్పఁగాఁ దాల్చి శృంగారముగను
జెలికత్తెపై నొకచేయి వైచికొని
వరరత్నభూషణావళులు దీపింప
కరిరాజగమనయై కాళ్ల నందియలు
గల్లుగల్లని మ్రోయఁ గఘురీవితోడ
వల్లభుముందర వచ్చి నిల్వంగఁ

జూచి రాజేంద్రుండు చోద్యంబునంది
ఈచకోరాక్షియు నీసుందరాంగి
యీవిద్రుమాధర యీకంబుకంఠి
ఈవరారోహయు నీసింహమధ్య
ఈనవరోమాళి యీనీలవేణి
ఈనగస్తనియును నీరాజహంస
ఈయలికుంతల యీపల్లవాంఘ్రి
ఈయేణనయనయు నీభీరుమధ్య
ఈ పుష్పగంధియు నీముద్దుచిలుక
ఈపద్మహస్తయు నీగజయాన
ఈపూర్ణశశిముఖి యీమోహనాంగి
నాపాలిజంగమనాథుకే తగును
అని యిట్లు వర్ణించి యతిగౌరవమున
మనసున నున్నట్టి మమతలు పాసి
కువలయాధిపుఁ డంత భవనంబు వెడలి
జవరాలిఁదోడ్కొని చక్కఁగా రాఁగఁ
గని కటకంబునఁగల కాంతలెల్ల
నినకులాధిపు మార్గ మెఱిఁగి యిట్లనిరి

భూనాథుఁడని బుద్ధి పూరిని మేసె
నేనాఁటిజంగమో యీప్రొద్దువచ్చి
లంజెనడిగినఁ దాను లంజె లేదనక
కొంజ కాంతనిభక్తి కొదువగాకుండ
నిల్లాలి వేశ్యఁగా నిచ్చుచున్నాఁడు
చెల్లునా యిది యేమి చిత్రమున్నాఁడు
నొక్కటైనైన నేఁ డుర్వీశ్వరుండు
నక్కటా, జంగాని కతఁడేలయిచ్చు
నిద్దఱుగాఁగ నాయురుపురిసంచు
నొద్దిక చాలక యుంటఁగాఁజూచి
ఇచ్చుచున్నవాఁ డీవు డిటువంటి
కుచ్చితబత్తియుఁ గొనసాఁగఁగలదె
యిచ్చిన సిద్ధటి నీవలెఁగాని
యొచ్చెంబుగాదటె యొకతె నీవుంగ
ననుచు నిట్టులు కొంద ఱాడుచునుండ
మన కేల యీమాట మానుఁడన్నారు
నాజంగమయ్యయు నాజనవరునిఁ
దేజీలు గజములు దివ్యాంబరములు

తృతీయాశ్వాసము

నన్నంబు సొమ్ములు నడుగనోఁగాక
యెన్నంగ వేశ్యఁదా నేఁటువలె నడిగె
నీరాజవదనుఁడు దా నీయకొం చెట్లు
వారకామిని లేక వచ్చి యీవేళ
నారిని దానిచ్చు టది యెంతఘనత
యాలలితాఁగియు నడ్డ గింతలును
వేయక పతివెంట వేశ్యయై నడువ
నాయింతిభక్తి యెంతని యాడువారు
భక్తిమార్గంబు చేపట్టినయపుడె
భర్తుండు చెప్పినపనులు మీఱకయ
చేసిన దిల్లాలు చేయక వేఱు
చేసిన గొంతి దాఁ జత్తినన్వారు
సతిపతి మన సౌక్య చందమైన
గతిగల్గు మీఁదటఁగల్లగాదనుచు
భూజనపాలునిఁబొగడెడువారు
నీజంగమయ్యకు నిల్లాలి నిచ్చి
యందఱుఁజూడంగ హరుని మెప్పించి
పొందితోఁ గైలాసమున కేఁగఁగలరు

అని యిట్టులును గొంద అనుకొనుచుండ
ఘనతగాఁ గైకొని కిరమర్థితోడ
మాటదప్పక జంగమయ్యాసన్నిధికి
నీటుమీఱఁగఁదెచ్చి నృపుఁడిట్టులనియె:
నీకును దగినట్టి నెలఁతఁ దెచ్చితిని
జేకొను విటరాజశేఖరమూర్తి
నావిని జంగంబు నరనాథుకనియె
కావోయి భల్లాణరాజవా నీవు
ఎంతసేపయ్యె నీవింతిఁ దేఁబోయి,
ఎంతైన నీయోజ నేలమానదవు
వెంగలిబుద్ధి భూవిభుఁడ నీబుద్ధి
జంగమవిటుఁడని చౌక చేసితివి
మామీఁదిచిత్తంబు మఱియేలనీకు
నీమాట నిజమని నేను నీపొద్దు
కరముఁగామాంధ తఁగను రెప్పలెడక
భూమీశ, నీరాకఁ బూని చూడఁగను
కన్నులు మూఁడయ్యె కాఁక మెండయ్యె
పన్నుగా విడువక పట్టెను మేను

సగమయ్యొ నీ వింత జాగుచేయఁగను
వగదప్పి మునుపటి వలపును దీఱ
నాకేల యీవేశ్య నడుజామునయ్యొ
నీకేడ నిజభక్తి నీకేడపాటి
పుసిగప్పుమాటలఁ బ్రొద్దుపుచ్చితివి
వసుధేశు లేయూరు వ్రతము లేయూరు
నరనాథులేయూరు నాయమేయూరు
ధరణీశు లేయూరు ధర్మమేయూరు
జననాథు లేయూరు శైవ మేయూరు
మనుజేశు లేయూరు మతము లేయూరు
సుగుణాత్ములైన సుదతియైనఁ
దగులుకొందురుగాక దాన మీఁగలరె
ఎందుకుఁగొఱగాని యింతిని దెచ్చి
యందుకొమ్మనిమెద వదియేల నాకు
నన నెంచి నిన్నునే నడిగితిఁగాక
తన కేల యీవేశ్య తపసిని నేను
బడలితివయ్య యీపడఁతిఁ దేఁబోయి
కడువేడ్క నీవైనఁ గైకొనిపొమ్ము

అని తూలఁబల్కిన నాయయ్యమాట
విని మనుజేంద్రుండు వినయోక్తిఁబలికె
నయ్యలు మీ రేమియాడినఁజెల్లు
నయ్యకుఁదెచ్చిన యంగనామణులఁ
దల్లులఁగాఁజూడ ధర్మంబు మాకుఁ
జెల్లులువోనాడఁ జెల్లునా మీకు
నాఁకలిగొన్నంత నన్న మెవ్వరికి
వీఁకతోఁగల్గునే విడనాడవడు
మనసురా నీ కొక్కమగువ గావలయు
నని యిట్లు వెదకంగ నాలస్యమయ్యె
నాతప్పు లెన్నక నాపాలఁగలిగి
యోతండ్రి, చేకొను ముదిద నీవనుచుఁ
బాదంబులకు నడ్డపడి లేవకున్న
నాదేవు కరుణించి యారాజుఁజూచి
నవ్వుమోము సేయుచు నయ మొప్పఁబలికె
నవనీశ, నిను రోయ నాడితిఁ గాక
నీవంటివాఁడేఁడి నిఖిలలోకములఁ
గావలెనని నాకుఁ గరమర్థితోను

తృతీయాశ్వాసము

వేశ్యఁ దెచ్చితివయ్య వేవేలుసేయ
వేశ్య గా దిది మంచివెన్నెల సిగ్గు
సిగ్గుగా దిది మంచి నెఱతమ్మిమొగ్గ
మొగ్గగా దిది మంచి ముద్దులచిలుక
చిలుకగా దిది మంచి చిత్తజు ముల్కి
ముల్కిగా దిది మంచి ముద్దులగుమ్మ
గుమ్మగా దిది మంచి కుందనబొమ్మ
బొమ్మగా దిది మంచి పొలఁతిరత్నంబు
అని యిట్లువర్ణించి యాజంగమయ్య
వనితను గృపఁజూచి వసుధేశుకనియె
నన్నతావులు మాకు నొప్పవు నీవు
నన్నట్టిగృహమున నువిదను నన్ను
వెనువెంట దోడ్కొని వేంచేయుమనిన
జనపతి కైదండ జంగమేశునకు
నిచ్చి తామెల్లన నిరువురిఁ గొనుచు
వచ్చియుండఁదగుమని వాసంబునందు
నయ్యపాదంబుల నలరు నర్చించి
చేయ్యనఁజేపట్టి సంభ్రమంబునను

భావించి తనయింటి పానుపుఁమీఁద
నేవిచారము లేక నీశ్వరుఁదెచ్చి
సవరగా గమ్మన జాజులుపఱచి
పవళింపఁజేసి భూపాలకుఁడిల్లు
వెడలివచ్చుచుఁ దనవెలఁదితో నసియెఁ
గడువేడ్క నిన్నాళ్లుఁ గౌఁగిలి తనకు
నిచ్చినట్లే యిమ్ము యియ్యక నీవు
వచ్చిన యొడయుని వదలనాడినను
ఖండింతునని చేత ఖడ్గంబుఁబట్టి
యుండెఁ దా నొకవంక నుర్వీశ్వరుండు
చల్లమాదేవియు జననాథుమాట
లల్లనఁ గైకొని యాగుటఁగాంచి
చల్లనిమాటల జాణతనమున
మొల్లసుగంధియై మొనసి నటింపఁ
జిన్నివెన్నెలనవ్వు చెక్కులందగను
జన్నులు మోముపై జౌకళింపగను
చూపులు శరములై సూటిగ నొరయ
తీపైన కెమ్మోవి తేనియ గురియ

తృతీయాశ్వాసము

వదనాబ్జబింబంబు వాసనల్ దొరయ
మృదువైన మైదీఁగె మెఱుపులు మెఱయ
సచలితగతిని రాయంచలజాడఁ
గచకుచభరమునఁ గౌనసియాడ
బంగరు చెఱఁగుల పయ్యెద జాఱ
జంగమ ముండిన సరనకుఁ జేరి
శరణార్థియనుచు నాస్వామికి మ్రొక్కి
చెఱకులు కొబ్బెర చేమబియ్యంబు
పరిమళగంధంబు ఫలరసాన్నములు
విరిజాజులును బైఁడి వెండిగిన్నియలఁ
బంచదారయు జున్నుపాలును నేయుఁ
గొంచుకవచ్చి యాగురున కర్పించి
పంచి పాగాలిచ్చి పండుటాకులను
హెచ్చుగఁ దాను జుట్టిచ్చుచు రాఁగ
తల్లితండ్రులయొద్దఁ దనయుని పగిది
మొల్లమౌ సంతోషమునఁ బాన్పుమీఁదఁ
బవళించియున్న యా పరమాత్మునకును
శివపదధ్యానినై చెలి వేడ్కమీఱఁ

బాదాల నొత్తుచుఁ బరిభాషలాడ
నాదేవుఁడును మాట లాడకయున్న
నా యొడయనితోడ నతివ యిట్లనియె
యేవిచారమును లే దేమాట లేదు
వచ్చినపని యేమి వారకామినితో
ముచ్చటలాడవు ముగుద చేఁతలను
నున్నావు రతిసేయ నొల్లవు నీవు
చిన్నవాఁడవు గావు సిగ్గునఁ బొదల
గంజెక్కియున్నావు కళలు దైవార
మిండజంగము కింత మెత్తనయేల
పోయెఁ బ్రొద్దును జాలఁ బురుషుఁడు చేయిఁ
జేయక తాఁజేయి సేయంగరాదు
గురునాథ, నాపయి కోరఁతలనెంచు
కొఱకునైయున్నావు గుట్టుతోడుతను
జంగాన కిది విటచందంబుఁగాదు
.........న న్నదరంటఁ బట్టి
శయ్యకు రాఁదీసి సగషతనొఱియఁ
జయ్యనఁ గెమ్మోవి చవి యాని కగచి

చెక్కులు గొనగోరఁ జీరి చేహత్తి
ముక్కరఁ దొలఁగించి ముద్దులుపెట్టి
గళరవంబులచేతఁ గరఁగించి మనసు
గిలిగింతలను జేసి గిరికొన్న వేడ్క
మరుకేళి సల్పని మగతనంబేల
చరలింగ, లెమ్మని చరణముల్ ముట్ట
లేవకయున్న నా లేమ యిట్లనియె
సేవ యెంతైనను జేకొనుఁగాని
ఇతనికి మోహంబు నించుక లేదు
బతిమాలి లెమ్మన్నఁ బలుకకున్నాఁడు
చలికూటిపై వెన్న సామ్యమైనాఁడు
తెలతెలగాఁ దూర్పుదిశఁ గానవచ్చె
దివియలు తెలుపయ్యె దివిఁ జుక్క పొడమె
భువనబాంధవుఁ డింకఁ బొడము వేళయ్యె
విరహుల తమకంబు వేసారిపోయె
మరుకేళి లేదయ్యె మంకుజాగముకు
యెల్లవారలలోన నీవిటు బాగు
చెల్లునే భువిలోనఁ జెలఁగునయ్యలకు.

ఇదియేమిచోద్యమో యీశ్వరా, యనుచు
మదిలోనఁ దత్తర మందుచుఁ గదిసి
పతిచిత్తమున కెక్క బలిమినినైన
నితనిఁ నేఁ గామింతు నిట్లని తలఁచి
చట్టాడుసేతలఁ జల్లమాదేవి
పట్టెమంచముమీఁది పఱుపుపై నెక్కి
శివరాత్రి నేఁడని చేసినయట్లు
దివియగంబములు నల్దిక్కుల వెలుఁగ
మొలనూలిగంటలు మ్రోయుచుఁ జెలఁగ
సొలపుమాటలు శివస్తుతులయితనర
పుప్పొడి తెల్లనిబూదిగా నమర
కప్పురదీపంబు గంపింపఁగాను
పరిమళాదులు మించి పాఱుచు రాఁగఁ
బరిపక్వమైనట్టి ఫలరసాన్నములు
లింగనైవేద్యంబు లెసఁగఁజూపట్ట
మంగళారతులయి మణులుఁ శోభిల్ల
హరునకుఁ దనదేహ మర్పించుకొఱకు
నరిమురివగలతో నాలింగనమ్ము

శిశువుకుఁ జన్నియ్యఁ జేరినయట్లు
శశిముఖి చేతులు సాచి సంప్రీతి
మరుకేళికిని దీయ మగువను మెచ్చి
విరుపాక్షుఁడప్పుడు విటరూపుమాని
చల్లమాదేవి హస్తములలోపలను
నెలనాళ్ల బాలుఁడై నిలిచెను శంభుఁ
డంతటనాశంభుఁ డాచల్లమాంబ
యంతరంగముగట్టి గని సోలిసోలి
చంటికి వాపోవఁ జనులు చేపూర
యింటిచాటున నున్న యిలనాథుఁడనియె
పుట్టుగొడ్రాలవు పోలఁతిరో, నీవు
యిట్టిచిత్రంబేమి యిపుడు వాపోవ
నాబాలుఁ డెవ్వరే యతివరో, యనిన
లోబల మెఱుఁగక లోఁతుగానక యుఁ
గడువేడ్కతో లంజెఁ గామించి వచ్చి
యొడయఁడు బాలుఁడై యుండి వాపోవు
చున్నాఁడు వీక్షింపు మోరాజవర్య,
యన్న నాభల్లాణుఁ డట చోద్యమంది

నీలకుంతలతోడ నేర్పునఁ బలికె
బాలక, యిటువంటిపనులు వల్దనుచుఁ
గేలున రెండుచెక్కిళ్లను వ్రేసి
పాలు వెన్నయుఁ బెట్టు బాలున కనిన
కన్నులు మూఁడును గలిగియున్నాఁడు
చిన్నదొవఁడు కొట్ట స్వాంశంబు రాదు
యనినఁ గన్నులు మూఁట నలరినశివుఁడు
వినువారలకు నెల్ల వినఁ జోద్యముగను
వెట్టిగొట్టెనుజేసి వేశ్య నన్నడిగి
కట్టుఁడై మనభక్తిఁ గొనియాడుకొంటకు
వచ్చినవాఁడైన వనితరో, వేగ
నిచ్చటఁ జూచెద నీశుని దెమ్ము
అని యిట్లుపలికిన యారాజుమాట
వినియు నాద్వారంబు వెడలె నాయింతి.
పడుచు సేతలు మాని పార్వతీశ్వరుఁడు
జడలలో మిన్నేరు శశివంకపువ్వు
పునుకలమాలయుఁబొరిఁజచ్చుకన్ను
తనరిన జింకయుఁ దలమిన్నువాఁక

తృతీయాశ్వాసము

యురగేంద్రహార ముత్తరజన్నిదంబుఁ
జెలుత వన్నియచేల చెలువొందు భూతి
గరుడోరగామరగంధర్వయక్ష
వరసిద్ధ సన్మునివరులు సేవింపఁ
గరమర్థి ప్రమథాదిగణములు గొలువ
మురియుచు భృంగియు ముందట నాడ
బసవేంద్రిగమనుఁడై భల్లాణునకును
అసమానుఁడగుచుఁ బ్రత్యక్షమై నిలిచె
నిలిచియున్నట్టి యా నిటలాక్షుఁ జూచి
తలయూఁచి భల్లాణధరణీశ్వరుండు
సంతోషమంది సాష్టాంగుఁడై మ్రొక్కి
యెంతయుఁ గరుణతో నెదురుగానిలిచి
శరణార్థి నగచాప జంగమరూప
శరణార్థి భవదూర శమనసంహార
శరణార్థి ధవళాంగ చంద్రోత్తమాంగ
శరణార్థి శివలింగ సద్గురులింగ
నీ పాదపద్మముల్ నేఁ జూడఁగంటి
యేపార నాభక్తి యీడేరె నిపుడు

సదమలాత్మక యీశ సకల లోకేశ
పదియాఱువన్నియపసిఁడి మచ్చునను
ఒఱసినవిధమున మెఱసి నాభక్తి
మెఱువుచేసితివయ్య, మేదినీస్థలిని
యనియిట్లు తనయిద్దఱాండ్రును దాను
గొనియాడ వారలఁ గృపఁజూచి హరుఁడు
మెచ్చితి భల్లాణ, మేలు నీభక్తి
కిచ్చెద నడుగుము యేవరంబైన.
నీవంటిభక్తులు నిఖిలలోకముల
నేవంక నున్నార లెన్నిచూడగను
అడిగిన లేదు పొమ్మనక నీభక్తి
కడముట్ట నేఁటితో ఘనుఁడవు నీవు
భల్లాణరాయ భూపాలక, నీవు
నిల్లాలి వేశ్యగా నిచ్చితి ననుచు
మనసున సందియ మందెదుసుమ్మ
తనయుఁడనై యుంటి తండ్రివి నీవు
తగ నీదుకులసతి తల్లియగా మాకుఁ
దెగువతో జెజ్జమాదేవికి సొమ్ము

తృతీయాశ్వాసము

మనుచును గృపసేసి యభవుఁ డాలోన
వనజాక్షియగు తనవనితతో ననియెఁ
జూచితే పార్వతి, క్షోణీశుభక్తి
యాచించి వేశ్య నే నడిగినయంత
నిచ్చెదనని పోయి యింతిలేకున్నఁ
దెచ్చివేగమె తన దేవి వేశ్యగను
భావంబుఁ దాఁజేసి భక్తి మెప్పించె
నీ వీరభల్లాణుఁ డెంతసాహసుఁడు
ఇతనికి మనలోక మిత్తమె యనినఁ
బతిమాటఁ గైకొని పార్వతి పలికె
ఏణాంకధరుఁడ, నీకేభక్తుఁడైనఁ
బ్రాణంబు నిచ్చెను భాగ్యంబునిచ్చెఁ
దనయునిఁ గోరఁగాఁ దఱిగి తా నిచ్చెఁ
గొనకొని శిరమును గోసియు నిచ్చె
మానంబు నిచ్చెనే మహినెవ్వఁడైన
మానంబు నిచ్చె నీ మానవాధీశుఁ
డితఁడు నిశ్చలభక్తుఁ డితఁడు సజ్జనుఁడు
ఇతనికి మనలోక మిచ్చుట మేలు

అనిన యంబికమాట హరుఁడు హర్షించె
వనజభవాదులు వర్ణనసేయ
జగజంపుగొడుగులు జననాథునకును
డెగువతోఁ బట్టిన తెఱఁగున వెలసి
పదివేల కిరణాల బాగున వెలుఁగు
చెదయ మొందెను భానుఁ డుదయాద్రిపైని
కలువలు ముకుళించెఁ గమలము ల్విరిసె
కలపక్షిరవములు గగనంబు ముట్టె
దేవదుందుభులును దివి నుండి మోసె
భూవలయంబునఁ బుష్పముల్ కురిసె
నెల్లవారలుఁ దల లెత్తి చూడఁగను
భల్లాణరాయనిపడఁతు లిద్దఱిని
పసిఁడి విమానంబు పైన నెక్కించి
బసవేంద్రగమనుఁడై భల్లాణుతోడ
నీలోకమున నుండి యీశ్వరమూర్తి
కైలాసమున కేఁగె ఘనరాజసమున
నంత నాశంభుండు నానందమునను
సంతోషచిత్తుఁడై శర్వాణి తాను

తృతీయాశ్వాసము

భల్లాణరాయనిఁ బ్రమథులలోన
బల్లిదుగాఁ జేసి పట్టంబుఁ గట్టి
మంగళగీతముల్ మగువలు డాసి
చంగునఁ బాడంగ శంఖముల్ మ్రోయ
బ్రహ్మాదు లిరువంక బలసి సేవింప
బ్రహ్మాంబు దానయ్యె పార్వతీశ్వరుఁడు
పరిజనంబై పెక్కుప్రమథులు గొలువ
నరిమురి సింహాసనస్థుఁడై యుండె
నని యిట్లు సూతుండు నాశౌనకాది
మునులకు వినిపించె ముదమున నట్టి
భల్లాణరాయభూపాలుని చరిత్ర
జల్లనిమాటల సరసంబుగాను
నాపాలి శ్రీ గురునాథుని పేరఁ
బాప సంహారు పేరఁ పరమేశు పేర
విరివిగ శ్రీరాచపీట వెలసిన
పరమాత్మ శ్రీ వీరభద్రుని పేర
విరచించి తీకథ విశ్వంబులోనఁ
దెలిఁగొప్ప జనులెల్ల స్థిరభక్తి విన్న

శృంగార భల్లాణ చరిత్ర

వ్రాసినఁ జదివినవారలకెల్ల
భాసురంబుగ నిహపరములు గల్గు
ధారుణి యున్నాళ్లు ధర్మ మున్నాళ్లు
మేరువు యున్నాళ్లు మిగుల నన్నాళ్లు
భూచక్రమునను నీపుణ్యునిచరిత
మాచంద్రతారార్కమై యొప్పఁ గాత!

సంపూర్ణము.